క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధితురాలికి నగదు అందజేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: మండలంలోని చీపురువలస గ్రామానికి చెందిన పట్టబోయిన రామకృష్ణ ఇటీవల మృతి చెందగా ఆయన భార్య కృష్ణవేణికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలను ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు చేతుల మీదుగా గురువారం అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

40 మద్యంసీసాల స్వాధీనం



మద్యం సీసాలను చూపిస్తున్న పోలీసులు

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 40 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఇదే ఘటనకు సంబంధించి, వెంకమ్మపేటకు చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాల పరిసరాలు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

బొబ్బిలి: స్థానిక సంఘం వీధిలోని రెండు పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. మరుగుదొడ్లు బాగుచేయాలని సిబ్బందికి సూచించారు. త్వరలో ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఏ మేర వసతులు ఉన్నాయన్న విషయం పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ కనకరాజు, ఏఈలు సురేష్, రవికుమార్ పాల్గొన్నారు.

ఈపీఎఫ్ పింఛన్ పెంపునకు 'చలో ఢిల్లీ'



మాట్లాడుతున్న శంకరరావు, శేషగిరిరావు

బొబ్బిలి: ఈపీఎఫ్ పింఛన్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఈ నెల 29, 30వ తేదీల్లో ధర్నా చేపడుతున్నట్లు ఈపీఎఫ్ పింఛన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.శేషగిరి, పి.శంకరరావు తెలిపారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఈపీఎఫ్ కనీస పింఛన్‌ను రూ.9 వేలకు పెంచుతామని బీజేపీ చెప్పిందని, వారు అధికారంలోకి వచ్చి పదేళ్లయినా వారు ఇచ్చిన మాట మర్చిపోయారని విమర్శించారు. గతంలో పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ పింఛన్ మొత్తాన్ని రూ.9 వేలకు పెంచాలని సిఫార్సు చేసినప్పటికీ అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీ కూడా అమలు చేయలేదన్నారు. రెండు రోజుల పాటు జరిగే ధర్నాలో పింఛన్‌దారులు పెద్దసంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

ఎన్‌టీఆర్‌కు ఘననివాళి



ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మండలంలోని పక్కి గ్రామంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్(నందమూరి తారకరామారావు) వర్ధంతి గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కార్యక్రమంలో పాల్గొని, ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎన్‌టీఆర్ సేవలను కొనియాడారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పర్యాటకుల సందడి



జలాశయం వద్ద పర్యాటకులు

మెంటాడ: మండలంలోని ఆండ్ర గ్రామంలో ఉన్న జలాశయం వద్ద పర్యాటకులు సందడి చేశారు. సంక్రాంతి వేడుకలు నేపథ్యంలో ఎక్కడెక్కడి నుంచో గ్రామం వచ్చిన వారు, పండగ సెలవులు కావడంతో విద్యార్థులు, ఉద్యోగులంతా రిజర్వాయర్‌ను చూసేందుకు తరలివచ్చారు. స్మార్ట్‌ఫోన్‌లతో సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలు దిగి, ఆనందంగా గడిపారు.

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎంపీడీవో రమామణి

రామభద్రపురం:

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో రమామణి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పటిష్ట ప్రణాళికలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రజలకు మౌలిక వసతులకు ప్రాధాన్యమిస్తూ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. గ్రామసభల్లో పంచాయతీల వివిధ కమిటీలను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వెంకటరమణ, ఏపీఎం రత్నాకర్, పంచాయతీ ఈవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.రవికుమార్ మాట్లాడుతూ ప్రజల మౌలిక సదుపాయాల కల్పన దిశగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పన జరగాలన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో ఏయే పనులు చేపట్టాలి, వాటికి చేపట్టాల్సిన ప్రణాళికలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ అరసాడ శంకరరావు, ఈవోపీఆర్‌డీ అల్లు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

9 రకాల సుస్థిరాభివృద్ధి పనులు..

బాడంగి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని, పంచాయతీలకు సమకూరే నిధుల ద్వారా ప్రజలకు అత్యవసరాలు తీర్చే అభివృద్ధి పనులను తొలుత చేపట్టాలని తెలిపారు. పంచాయతీలకు వచ్చే సాధారణ నిధులతో పాటు 15వ ఆర్థికసంఘం నిధులు, ఉపాధి హామీ పథకం ద్వారా వచ్చే నిధులను ఓ ప్రణాళిక ప్రకారం అభివృద్ధి పనులకు కేటాయించాలన్నారు. తొలుత గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టులు నిర్మించాలన్నారు. పంచాయతీల్లో 9 రకాల సుస్థిరాభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో రెండు సార్లు గ్రామసభలు నిర్వహించి, 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించుకోవాలని, అలాగే వాటికి అవసరమయ్యే ప్రణాళికలు కూడా రూపొందించుకోవాలన్నారు.



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీడీవో రమామణి

ముగిసిన శిక్షణ తరగతులు..

తెర్లాం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికల శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఎంపీడీవో శంబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల తయారీపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శులంతా సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు తయారు చేసుకోవాలని ఎంపీడీవో తెలిపారు. గ్రామ పంచాయతీల్లో 29 అంశాలపై ఏ విధంగా అభివృద్ధి చేయాలో చర్చించి, ఆ మేరకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో 9 అంశాలపై ఏ గ్రామ పంచాయతీ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందో గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెంటాడ: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులంతా సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికలపై రెండు రోజుల పాటు ఇస్తున్న శిక్షణ కార్యక్రమంలో గురువారం పాల్గొన్న ఆయన గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, వాటి తీర్మానాలు, వాటి ప్రణాళికలను ఈ–గ్రామస్వరాజ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎంపీడీవో త్రివిక్రమ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు అవసరమైన ఆర్థిక వనరులను అన్వేషించడంతో పాటు మంజూరైన నిధులను ఏయే పనులకు ఎంతమేర ఖర్చు చేయాలో కూడా ముందుగా నిర్ణయించుకోవాలన్నారు.

రాజాం: గ్రామపంచాయతీల్లో ఆదాయ వనరులు సృష్టించేందుకు ప్రణాళికలు రూపొందించాలని, ఆదాయాన్ని పెంచుకుంటూనే అభివృద్ధి కూడా సాధించాలని వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జీపీడీపీ(గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక), బీపీడీపీ(బ్లాక్ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల) తయారీపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ నిధులు, సొంత ఆదాయ నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేయాలని, ఖర్చు చేస్తున్న నిధులతో పంచాయతీకి ఆదాయం వచ్చే పనులను గుర్తించాలన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణను పంచాయతీ కార్యదర్శులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో బాలసభలు, మహిళా సభలు, గ్రామసభలు నిర్వహించి, ప్రణాళికలు తయారు చేసుకుని, ఆమోదం పొందాలన్నారు. ఈ నెలాఖరులోగా వీటిని ఆన్‌లైన్‌లో మండల పరిషత్‌కు చేరేలా చూడాలన్నారు. అనంతరం ట్రైనర్ హరి ప్రణాళికలు రూపొందించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఈవోపీఆర్‌డీవో వావిలపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ వంజరాపు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాడంగి: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఆంజనేయులు



మెంటాడ: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ సన్యాసినాయుడు



బొబ్బిలి: సూచనలిస్తున్న ఎంపీడీవో రవికుమార్



తెర్లాం: శిక్షణ తరగతుల్లో సిబ్బందికి సూచనలిస్తున్న అధికారులు



రాజాం: మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ కన్వీనర్ రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ నర్సింహులు

నియోజకవర్గ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

● ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి

తెర్లాం: నియోజకవర్గ స్థాయిలో జరగనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో క్రీడాకారులు సత్తా చాటాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె క్రీడాకారులను ఉద్దేశించి కాసేపు మాట్లాడారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన క్రీడాకారులంతా నియోజకవర్గ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ఆటతీరును కనబరచాలన్నారు. ప్రతీ క్రీడాకారుడు బాగా ఆడి, మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా పేరిట ఆటలపోటీలు నిర్వహించడం జరుగుతోందన్నారు. జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు పాల్గొన్నారు.



క్రీడాకారులను ఉద్దేశించి, మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి



నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విజయరాంపురం జట్టుతో ఎంపీడీవో రామకృష్ణ

నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన జట్లు..

తెర్లాం: మండల కేంద్రంలో ఈ నెల 10 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్రాల ఆటల పోటీల్లో అత్యుత్తమ ఆటతీరును కనబరిచి, నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన జట్లను ఎంపీడీవో శంబంగి రామకృష్ణ గురువారం ప్రకటించారు. మండలంలోని 21 గ్రామ సచివాలయాల నుంచి క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో పాల్గొన్నారని, నియోజకవర్గ స్థాయిలో జరగనున్న వాలీబాల్ పోటీలకు బాలురు విభాగంలో విజయరాంపురం సచివాలయం క్రీడాకారులు, ఖోఖో పోటీలకు బాలురు విభాగంలో నెమలాం సచివాలయం జట్టు, బాలికల విభాగంలో పెరుమాళి సచివాలయం జట్టు ఎంపికయ్యాయన్నారు. కబడ్డీ పోటీలకు బాలురు విభాగంలో పణుకువలస సచివాలయం క్రీడాకారులు అర్హత సాధించారన్నారు. బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు బాలురు విభాగంలో పణుకువలస సచివాలయం, బాలికల విభాగంలో వి.చిన్నయ్యపేట సచివాలయం క్రీడాకారులు ఎంపికయ్యారన్నారు. క్రికెట్ పోటీలకు బాలురు విభాగంలో లోచర్ల సచివాలయం జట్టు అర్హత సాధించిందన్నారు. మండలం నుంచి నియోజవర్గ స్థాయి పోటీలకు ఎంపికై న క్రీడాకారులందరినీ ఎంపీడీవో, పీడీలు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులంతా అభినందించారు.

● క్రీడలతో మానసిక ఉల్లాసం



సంతకవిటి: మండాకురిటిపై విజేతగా నిలిచిన జావాం క్రికెట్ జట్టు



రేగిడి: దేవుదళలో షటిల్ బాడ్మింటన్ పోటీలు



రాజాం సిటీ: క్రీడాపోటీలను తిలకిస్తున్న అధికారులు

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ అందివ్వడమే లక్ష్యంగా ఆడుదాం ఆంధ్రా పేరిట ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడాపోటీలు ఉల్లాసంగా ఉత్సాహంగా జరుగుతున్నాయి. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో గురువారం జరిగిన పోటీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని, యువత, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. క్రీడలతోనే శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఆటలో గెలుపోటములు సహజమని, ఓటమికి కుంగిపోకుండా విజయమే లక్ష్యంగా పయనించాలన్నారు. –సాక్షి నెట్‌వర్క్.

వైఎస్సార్ ఆసరాపై విస్తృత ప్రచారం



రాజాం: పెనుబాకలో లబ్ధిదారు మహిళకు బొట్టు పెట్టి మరీ పథకం లబ్ధిని వివరిస్తున్న సర్పంచ్ బోదమ్మ

రాజాం: వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత నగదు పంపిణీపై మండలంలోని పలు గ్రామాల్లో గురువారం విస్తృత ప్రచారం చేపట్టారు. వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి, బొట్టు పెట్టి మరీ త్వరలో వారి బ్యాంకు ఖాతాలో జమకానున్న పథకం లబ్ధిని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఆ పథకం లక్ష్యాన్ని వివరించారు.

రేగిడి: మండలంలోని పాతచెలికానివలస, వెంకమ్మపేట, తునివాడ, మీసాలడోలపేట గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పథకం నాలుగో విడత డబ్బుల పంపిణీపై ఇంటింటా ప్రచారం చేపట్టారు. గ్రామాల్లోని వైఎస్సార్ క్రాంతి పథం సీసీలు, సీఎఫ్‌లు, వీవోఏలంతా ఇంటింటికీ వెళ్లి, లబ్ధిదారులకు వస్తున్న పథకం లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం గోవిందరావు పాల్గొన్నారు.



రేగిడి: పాతచెలికానివలసలో ప్రచారంలో సర్పంచ్ అప్పలనాయుడు, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది

ఘనంగా గ్రామదేవతల తీర్థం

లక్కవరపుకోట/ కొత్తవలస: ఎల్.కోట మండలంలోని రేగ గ్రామంలో మరిడిమాంబ, రంగరాయపురంలో పరదేశమ్మ, కొత్తవలస మండలంలోని తుమ్మి కాపల్లిలో ముత్యాలమ్మ, ఉత్తరాపల్లిలో పరదేశమ్మతల్లి తీర్థ మహోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవార్లను గ్రామ స్తులతో పాటు చుట్టుపక్క గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామపెద్దల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వేపాడ: మండలంలోని పెదగుడిపాల, వీలుపర్తిలో గ్రామదేవతల తీర్థం, పెదగుడిపాలలో లక్ష్మీనరసింహస్వామి తీర్థం గురువారం వైభవంగా నిర్వహించారు.ఉదయం నుంచి పెదగుడిపాల, వీలుపర్తి గ్రామాల్లో అమ్మవార్లకు పెదగుడిపాలలో లక్ష్మీనర సింహస్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

రెండు గ్రామాల్లో డ్రోన్ సర్వే

వేపాడ: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని సోంపు రం, అరిగిపాలెం గ్రామాల్లో గురువారం డ్రోన్ సర్వే పూర్తి చేశామని తహసీల్దార్ ప్రసన్నకుమార్ తెలిపా రు. మరో 9 గ్రామాల్లో డ్రోన్ సర్వే చేయనున్నట్లు పేర్కొన్నారు. డ్రోన్ సర్వే పూర్తి కాగానే ఓఆర్‌ఐ మ్యాప్‌లు వస్తాయని, వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో సమగ్ర భూరీసర్వే చేపడతామని చెప్పారు.శింగరాయి గ్రామంలో ప్రభుత్వ, జిరాయితీ భూములు కలిపి 697.14 ఎకరాలు, సోంపురంలో 1208.87 ఎకరాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. సర్వేలో మండల సర్వేయర్ అప్పలనాయుడు సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

బొబ్బిలి: స్థానిక పాతబొబ్బిలిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బుక్కా వెంకటరమణ అనే వ్యక్తిని పోలీసులు గురువారం సాయంత్రం పట్టుకుని, అరెస్ట్ చేశారు. అనంతరం అతడి వద్ద నుంచి 51 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు గ్రామం వెళ్లి, ఆకస్మిక దాడులు చేయగా, మద్యం విక్రేత పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు.

విస్తారంగా అపరాల సాగు

వంగర: మండలంలోని అన్ని గ్రామాల్లో అపరాల సాగును రైతులు విస్తారంగా చేపడుతున్నారు. కె.కొత్తవలస, కొప్పర, ఎం.సీతారాంపురం, వంగర, తలగాం, రుషింగి, రాజులగుమ్మడ, బంగారువలస, కొండచాకరాపల్లి తదితర గ్రామాల్లో పెసర, మినుము పంటల సాగు అధికంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం ఏవో తట్టికోట కన్నబాబు పలు గ్రామాల్లోని రైతులకు ఆయా పంటల్లో వచ్చే సీజనల్ వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

పక్కాగా కులగణన చేపట్టాలి

● ఎంపీడీవో ఆంజనేయులు

బాడంగి: పక్కాగా కులగణన చేపట్టాలని ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ రఫీజాన్ సూచించారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో గురువారం సమావేశమైన వారు పలు సూచనలు, సలహాలు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి కులగణన సర్వే ప్రారంభమవుతుందని, ఈ నెల 28వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుందన్నారు. గ్రామం బయట ఉన్న వారి కోసం ఫిబ్రవరి 2వ తేదీ వరకు సర్వేకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. సర్వే నివేదికను ఎప్పటికప్పుడు మండల పరిషత్ కార్యాలయానికి తెలియజేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఏఈ ప్రవీణ్‌కుమార్, ఏవో శిరీష, ఎంఈవో దొర, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి కులగణన

బొబ్బిలి: మండలంలో శుక్రవారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు జరిగే కులగణన సర్వేను సక్రమంగా చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఇదే విషయమై తన చాంబర్‌లో సచివాలయ సిబ్బందితో సమావేశమైన ఆయన ఇంటింటికీ వెళ్లి, కులగణన సర్వే చేయాలని, సర్వే సమయంలో లేనివారు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 5వ తేదీలోగా సచివాలయాలను సంప్రదించి, సమాచారమివ్వాలన్నారు.



బాడంగి: కులగణన నిర్వహణపై సూచనలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు, తహసీల్దార్ రఫీజాన్

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ కులగణన పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎంవీ నాగరాజు సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నోడల్ అధికారులు, సచివాలయ అడ్మిన్లతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి, సమాచార సేకరణ పూర్తిస్థాయిలో చేసి, పత్రాలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చక్రవర్తి, ఏఈ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: సచివాలయ సిబ్బందితో సమావేశమైన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు



రాజాం సిటీ: మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు